క్లుప్తంగా

గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా


సీఐ అప్పన్న

పాయకరావుపేట: గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా పెంచనున్నట్టు సీఐ జి.ఎన్. అప్పన్న తెలిపారు. ఎస్.రాయవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ


ఫ్యాన్లు,ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను వితరణగా అందజేశారు. ఇదే హైస్కూల్‌లో 1990-91లో చదువుకున్న విద్యార్థులు రెండు ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లను హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావుకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేగి దేవత నాయుడు, దాడి సాంబశివ, పెతకంశెట్టి భాస్కరరావు, ఆడారి సంతోష్‌కుమార్,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించాలి


మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

మునగపాక: ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు కోరారు. గవర్ల అనకాపల్లిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలమరశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్,మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

యలమంచిలి రూరల్: స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు యలమంచిలి మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షురాలు పి.విజయ తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కుటుంబ తగాదాలు, బ్యాంకు రుణాలు, టెలిఫోన్,ఇంటి పన్ను బకాయిలతో పాటు చట్టపరిధిలో రాజీపడే అవకాశం ఉన్న కేసులన్నిటినీ పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

రిటైర్డ్ ఎంపీడీవోకు సన్మానం


రామచంద్రరావుని సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఎస్.రాయవరం: ఎంపీడీవోగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన రామచంద్రరావును మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పాయకరావుపేట ఎంపీడీవో పి.వెంకటనారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు ధూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు , వైబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందలాపల్లిలో పూజలు

మునగపాక(అచ్యుతాపురం):అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందలాపల్లిలోని శ్రీ కృష్ణుని విగ్రహాన్ని బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గురువులు... సేవా మూర్తులు

బోధన, సేవా కార్యక్రమాలతో మన్ననలు పొందుతున్న ఉపాధ్యాయులు



నక్కపల్లి: విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా పిల్లలను తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. అటువంటి ఉపాధ్యాయులను ప్రతిఏటా సెప్టెంబరు 5వ తేదీన గురుపూజోత్సవం పేరుతో గౌరవించుకోవడం అనాదిగా వస్తోంది. గురుపూజోత్సవం సందర్భంగా మండలంలో ఉపాధ్యాయ వృత్తితోపాటు పలు సేవాకార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న వారి గురించి...

శర్మ మాస్టారు...సేవకు మారు పేరు


సత్యదేవశర్మ

నక్కపల్లికి చెందిన శ్రీపాద సత్యదేవ శర్మ... ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పలు సేవాకార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఈయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించింది. పదవీవిరమణ చేసినప్పటికీ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పదవీవిరమణ చేసి దాదాపు 15 ఏళ్లు గడచిపోయినప్పటికీ సేవా, వితరణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సొంతనిధులతోపాటు, దాతల నుంచి కొంత నిధులు సమీకరించి చినదొడ్డిగల్లు గ్రామంలో రామాలయం, శివాలయం నిర్మించి ప్రతి ఏటా వచ్చే పలు పర్వదినాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెద బోదిగల్లం పాఠశాలలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నారు.

విద్యార్థులకు అండగా.. ఏడిద


ఏడిద వెంకటరమణ

చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఏడిద నాగేశ్వరరావు విద్యార్థులకు అండగా నిలుస్తూ వారి ఉన్నతి కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిస్‌క్లబ్ ఏర్పాటు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేస్తున్నారు.గత ప్రభుత్వం అమలు చేసిన టోఫెల్, సీబీఎస్‌ఈ వంటి సిలబస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్ అర్థమయ్యేరీతిలో బోధన చేస్తూ విద్యార్థుల మన్ననలు పొందారు.తనకున్నపరిచయాల ద్వారా విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించారు. గత ఏడాది ఈయన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్నారు.

బడి బాగుండాలని కోరుకున్నారు..


కోడి శ్రీనివాసరావు

నక్కపల్లి : తాను పనిచేసే ప్రతి పాఠశాలలోనూ తనదైన ముద్ర వేస్తూ ఏదో ఒక ప్రత్యేకత చాటుకుంటారు.. ముఖ్యంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తుంటారు.. ప్రస్తుతం పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం హెడ్సీహైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కోడి శ్రీనివాసరావు విద్యాబోధనతో పాటు సేవ కార్యక్రమాల్లోనూ ముందుంటారు. ఆ మాస్టారు గతంలో ఎస్.రాయవరం మండలం దార్లపూడి, నక్కపల్లి మండలం ఉద్దండపురం పాఠశాలల్లో పనిచేశారు. ఆ సమయంలో అమెరికాలో తనకు పరిచయస్తులైన ఇద్దరు ఎన్‌ఆర్‌ఐల నుంచి లక్షలాది రూపాయలు విరాళాలు సేకరించి పాఠశాలలకు అవసరమైన వాటర్‌ప్లాంట్లు, మైక్ సెట్లు, డైనింగ్ హాళ్ల నిర్మాణం, విద్యార్థుల కోసం బెంచీలు, ఫర్నిచర్, బీరువాలు, కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. పేద విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత చదువులకు పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఉపకారవేతనాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఉద్దండపురంలో పనిచేసిన సమయంలో సరైన వసతి, ఉపాధ్యాయుల కొరత ఉన్న సమయంలో కూడా ఇక్కడ చదివిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించేలా మెరుగైన బోధన చేసి గ్రామస్తుల మన్ననలు పొందారు. ఆయన బదిలీ అయిన సందర్భంలో గ్రామస్తులంతా కలిసి గ్రామంలో ఊరేగించి ఘనంగా వీడ్కోలు పలకడం విశేషం.

గ్రావెల్ రోడ్డు, బోరు మంజూరు

జగనన్న కాలనీకి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక: స్థానిక జగనన్న కాలనీకి గ్రావెల్ రోడ్డు వేసేందుకు తనకోటా నిధుల నుంచి రూ.5లక్షలతో పాటు బోరు ఏర్పాటుకు మరో రూ.లక్ష మంజూరు చేస్తున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అర్హులైన పేదలకు జగనన్న కాలనీల్లో పట్టాలు అందజేశారన్నారు.కాలనీకి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,ఎంపీటీసీ-3 బోడకుర్తి గణేష్, వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షులు బొడ్డేడ మహేష్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పిల్లి అప్పారావు, పోలవరపు రమణ,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతన అలవరచుకోవాలి


శ్రీ కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్


పోటీల్లో వేసిన ముగ్గులు

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మునగపాక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలకు వెళ్లడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఉత్సవకమిటీ చైర్మన్ వేగి కృష్ణ,పెద్దలు కర్రి సాయికృష్ణ,పెంటకోట విజయ్,శ్రీ కృష్ణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో విజేతలకు రామ్మోహనరావు, కృష్ణ,ఆడారి శ్రీకాంత్‌లు బహుమతులు అందజేశారు.

ఆస్పత్రుల కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి


విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బందికి నాలుగు నెలల నుంచి ఇవ్వాల్సిన బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం యలమంచిలిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు విలేకరులతో మాట్లాడారు.

ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్ చెల్లిస్తున్న ఈఎస్ఐ, పీఎఫ్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని చెప్పారు. వీరికి కనీస వేతనం రూ.16,500 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నేటికీ అమలుకాలేదన్నారు.ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను అవుట్‌సోర్సింగ్‌లో చేర్చాలని కోరారు. సీఐటీయూ జిల్లా నేతలు ఎం.అప్పలరాజు, చింతకాయల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని హాస్టల్ మూసివేతకు ఆదేశం

నక్కపల్లి: ఉపమాక శివారు కొండవెనుకపాలెంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న షెల్టర్ హోం (హాస్టల్)ను మూసివేయావలని జిల్లా స్థాయి తనిఖీ బృందం ఆదేశించింది. ఇటీవల కోటవురట్ల మండలంలో ఒక వసతి గృహంలో ఆహారం కలుషితమై ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడిన నేపథ్యంలో అధికారులు అనుమతి లేని వసతి గృహాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తనిఖీలు చేశారు. గత నెల కొండవెనుకపాలెంలో ఇలాంటి వసతి గృహాన్ని గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకుండా 51మంది విద్యార్థులతో వసతి గృహం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. దీంతో బుధవారం జిల్లా ప్రొటెక్షన్ అధికారి లక్ష్మి, శరత్‌కుమార్‌లతో కూడిన బృందం ఈ వసతి గృహాన్ని సందర్శించింది. హాస్టల్‌ను మూసివేసి, ఇక్కడ చదివే విద్యార్థులను తక్షణమే వారి తల్లిదండ్రుల అనుమతితో వేరే స్కూళ్లు, హాస్టళ్లలో చేర్చాలని అధికారులను ఆదేశించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సముచిత గౌరవం


సత్యనారాయణ


రొబ్బి లక్ష్మి


కె.కె.ఎల్.ఎన్ ధర్మారావు


కె.సంపత్


కె. వీరునాయుడు


ఎ.సుధాకర్


ఎం.భానుశ్రీ


సీహెచ్.విమలాదేవి


బి.శారద

నక్కపల్లి: మండలంలో పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చోడిశెట్టి సత్యనారాయణ ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్టు పాఠశాల సిబ్బంది తెలిపారు.ఈ నెల 5వ తేదీన సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతినిపురస్కరించుకుని గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో జిల్లా మంత్రులు,కలెక్టర్,డీఈవో చేతులమీదుగ అవార్డు అందుకోనున్నారు. విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచుతూ పదోతరగతి పరీక్ష సమయంలో ప్రత్యేక తరగతులునిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన సత్యనారాయణ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మునగపాక: మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రొబ్బి లక్ష్మి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. సర్పంచ్ సుందరపు తాతాజీతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్.రాయవరం మండలం నుంచి ఏడుగురు ఎంపిక

ఎస్.రాయవరం: మండలం నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఏడుగురు ఎంపికయ్యారు. గుర్రాజుపేట ప్రధానోపాధ్యాయుడు కె.కె.ఎల్.ఎస్. ధర్మారావు, ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కె.సంపత్, కె.వీరునాయుడు,పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎ.సుధాకర్, మరో ఉపాధ్యాయురాలు ఎం.భానుశ్రీ, పి.ధర్మవరం ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ విమలాదేవి, రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బి.శారద జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

పచ్చని చెట్లు..ప్రగతికి మెట్లు


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, జీవకోటికి ప్రాణవాయువు అందించే వాటిని కాపాడికోవడం మనందరి బాధ్యత అని కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం అన్నారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల ఆవరణలో వివిధ పండ్ల మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షుడు కృష్ణ, కె.దేవి,సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


కడపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం కడపాలెంలో ఆక్రమణలను తొలగించే పనులకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. సర్వే నంబర్ 85-4లో 4.30 సెంట్లలో ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించిన అధికారులు జేసీబీ సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

మునగపాక: ప్రతి బీఎల్‌వో ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాల్లో లోపాలను సవరించాలని, కుటుంబ సభ్యులంతా ఒక చోట ఉండేలా ఓటరు జాబితాలు తయారు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎసైన్షియా మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలి


చిన్నారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక(అచ్యుతాపురం): ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తక్షణమే అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ఫార్మాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఈజెడ్ ప్రాంత నివాసి యల్లబిల్లి చిన్నారావు చిత్రపటం వద్ద బుధవారం ఆయన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.2లక్షల పరిహారం ప్రకటించినా ఇంతవరకు అందజేయలేదని చెప్పారు. ఆ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, గోపాల్,రమేష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలి


విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక

మునగపాక: విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని డాక్టర్ మౌనిక తెలిపారు. మునగపాక మండలం పాటిపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవల్లికతో కలిసి బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్‌లో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తాజా ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్ననాడే చదువుపై దృష్టి సారించగలరని చెప్పారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి,సీహెచ్‌వో దేవకాంత, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు,హెల్త్ అసిస్టెంట్ విల్లూరి జగన్నాథరావు, జ్యోతీలాల్, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గా,ఏఎన్‌ఎం పెంటకోట సుజాత, ఆశ కార్యకర్త వెంకటలక్ష్మి,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం హరిపాలెంలో గురువారం మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా రాత్రి గాజువాక నడుపూరుకు చెందిన శ్రీ మాతృ శ్రీ కళానికేతన్ వారిచే మనసా కవ్వించకే సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

తడిసిన రేషన్ బియ్యం పంపిణీ


చినబొడ్డేపల్లిలో తడిసిన బియ్యాన్ని చూపిస్తున్న సర్పంచ్ శివరామ్

కోటవురట్ల: తడిసిన బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా సర్పంచ్ పైల శివరామ్ అడ్డుకున్నారు. చినబొడ్డేపల్లిలో బుధవారం రేషన్ సరుకుల పంపిణీ నిర్వహించారు. పలువురు లబ్ధిదారులు బియ్యం తడిసిపోయాయని, రంగు కూడా మారిపోయాయని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ పంపిణీ చేస్తున్న వ్యాను వద్దకు వెళ్లి బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం తడిసి రంగు మారి ఉండడాన్ని గమనించారు. ఆ బియ్యాన్ని పంపిణీ చేయొద్దని, తడవని, రంగు మారని బియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలని ఎండీయూ సిబ్బందికి సూచించారు.